# కాంగ్రెస్‌వి ఫేక్ హామీలు ఝూటా మాటలు

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ అహంకారానికి హద్దుల్లేవ్
- నోటికి ఏదొస్తే అది మాట్లాడుతున్నడు
- ధర్మపురి సభలో చెప్పినవన్నీ అబద్ధాలే
- ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్



బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

ధర్మపురి/ధర్మపురి రూరల్, నవంబర్13: ''కుట్రలు, కుతంత్రాలతో అధికారంలోకి రావాలని చూస్తున్న కాంగ్రెస్ ఇచ్చేవన్నీ ఫేక్ హామీలు. చెప్పేవన్నీ ఝూటా మాటలు. నమ్మితే మోసపోతరు. జాగ్రత్త' అంటూ ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ధర్మపురి మండలం జైన, మగ్గిడిఎడపెల్లి, దొంతాపూర్, ఆరెపెల్లి గ్రామాల్లో సోమవారం ప్రజాఆశీర్వాద యాత్ర నిర్వహించగా, ఆయా గ్రామాల్లో మహిళలు ఘన స్వాగతం పలికారు. డప్పుచప్పుళ్లు, బతుకమ్మ ఆటలతో పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్ పాదయాత్రగా గ్రామాల్లోని ప్రతి వీధిలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఈశ్వర్ మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీల కట్టు కథలు నమ్మవద్దని, పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేసే బీఆర్ఎస్ ప్రభుత్వానికే మళ్లీ పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రెండు రోజుల క్రితం ధర్మపురి సభలో అహంకారపూరితంగా, నోటికి ఏదొస్తే అది మాట్లాడిపోయాడని, మరీ అంత అహంకారం పనికిరాదన్నారు. ఒక వేళ పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే అదే అహంకారం ప్రజలపై కూడా చూపిస్తారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పడ్డ కరెంటు కష్టాలను గుర్తుకుతెచ్చుకోవాలని, మళ్లీ ఆ నరకం మనకు అవసరమా..? అని ప్రశ్నించారు. ముక్కిపోయిన మూడు గంటల కరెంటు కావాలా..? 24గంటల నాణ్యమైన కరెంటు ఇచ్చే బీఆర్ఎస్ కావాలా..? ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. కాంగ్రెస్ కర్ణాటక మోడల్ నమ్ముకుంటే కటిక చీకట్లోకి వెళ్లిపోతామన్నారు. నమ్మి ఓటేసిన అక్కడి ప్రజలను ఆ పార్టీ నిండా ముంచిందన్నారు. గతంలో రైతుల దగ్గర పన్నులు వసూలు చేపిన చరిత్ర కాంగ్రెస్‌దైతే, ఇప్పుడు రైతులకే రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ ఇస్తున్న ఘనత బీఆర్ఎస్‌దన్నారు. యాసంగిలో రైతులకు రైతుబంధు ఇవ్వవద్దని ఎలక్షన్ కమిషన్‌కు కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేయడం దారుణమని, రైతులు బాగుపడితే వాళ్లు చూడలేరని, అందుకే ఇల్లా రైతుబంధుకు అడ్డంపడుతున్నారని దుయ్యబట్టారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తున్నదని, దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని చెప్పారు. ఇప్పుడు ఎన్నికల సందర్భంగా అన్నివర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ రూపొందించిన మ్యానిఫెస్టో, విజయానికి నాంది అవుతుందన్నారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీటీసీ బత్తిని అరుణ, ఎంపీపీ చిట్టిబాబు, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్, ఆర్బీఎస్ మండల కన్వీనర్ సౌళ్ల భీమయ్య, పీఏసీఎస్ చైర్మన్ సౌళ్ల నరేశ్, ఏఎంసీ వైస్ చైర్మన్ అక్కనపల్లి సునీల్‌కుమార్. సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.



పూడూర్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వినోద్‌కుమార్, రవిశంకర్

# కాంగ్రెస్ వస్తే కటిక చీకట్లే

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- రాష్ట్రంలో బీజేపీ ప్రజలు నమ్మరు: ఎమ్మెల్యే రవిశంకర్
- కొడిమ్యాలలో ముఖ్య కార్యకర్తల సమావేశం

కొడిమ్యాల, నవంబర్ 13: ''కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణ మళ్లీ అంధకారమైతది. కటిక చీకట్లలోకి వెళ్లిపోతుంది. ఆ పార్టీ పాలన మనకు కొత్తనా..? గతంలో ఎన్ని కష్టాలు పెట్టిందో.. ఎన్ని ఇబ్బందులు పెట్టిందో.. మనం చూడలేదా..? నమ్మితే మోసపోతమని'' రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ ప్రజలకు సూచించారు. సోమవారం కొడిమ్యాల మండలకేంద్రంలో కొడిమ్యాల, మల్యాల మండలాల కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించగా, వినోద్‌కుమార్ హాజరై మాట్లాడారు. అన్నిరంగాల్లో దూసుకెళ్తూ, సంక్షేమంలో ఆదర్శంగా నిలుస్తున్న రాష్ట్రానికి సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ప్రతి ఇంటికి ఏదో ఒక రకంగా లాభం జరుగుతున్నదని చెప్పారు. పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మన మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించాలని సూచించారు. ఆసరా పింఛన్ రూ.2016 నుంచి రూ.5వేలకు పెంపు, ప్రతి మహిళకు రూ.3 వేల పింఛన్, కేసీఆర్ బీమా కింద పేద కుటుంబాలకు రూ.5 లక్షల బీమా సౌకర్యం, రూ.400కే సిలిండర్ అందించనున్న విషయాన్ని వివరించాలని సూచించారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఆ పార్టీ పనైపోయిందని ఎద్దేవా చేశారు. చొప్పదండి నియోజకవర్గాన్ని తాను రూ.1600 కోట్లతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని వివరించారు. స్థానికంగా నాణ్యమైన వైద్యం అందించేందుకు పల్లె దవాఖానలు కట్టిస్తున్నట్లు చెప్పారు. కాగా, వివిధ గ్రామాలకు చెందిన 100 మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి వినోద్‌కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అలాగే పూడూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇక్కడ ఎంపీపీ మేన్నేని స్వర్ణలత, జడ్పీటీసీ సభ్యులు పునుగోటి ప్రశాంతి, కొండపల్కల రాంమోహన్‌రావు, రెండు మండలాల మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు పునుగోటి కృష్ణారావు, మిట్టపల్లి సుదర్శన్, సింగిల్ విండో చైర్మన్లు మేన్నేని రాజనర్సింగరావు, పోలు రాజేందర్, బండ రవీందర్‌రెడ్డి, రెండు మండలాల బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పులి వెంకటేశంగౌడ్, జనగాం శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తైదల శ్రీలత, రెండు మండలాల సర్పంచ్‌లు ఉన్నారు.

# స్థానికేతరుడు కావాలా..? స్థానికుడు కావాలా..?

- మీరే ఆలోచించుకోండి
- నేను ఈ మట్టిలో బిడ్డను.. మీ వెన్నంటే ఉంటా
- ప్రతిపక్షాలవన్నీ అబద్ధాలే
- ఓటమి భయంతో ఆగమాగమైతున్నయి
- కోరుట్లలో కార్నర్ మీటింగ్‌లో డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల



కోరుట్ల :11వ వార్డులో యువకుడిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, నవంబర్ 13: ''ఎన్నికలు దగ్గర పడుతుండడంతో కాంగ్రెస్ ఆగమాగమవుతున్నది. ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు అసత్యప్రచారం చేస్తున్నది. ఓటమి భయంతో ఏం చేయాలో తెలియక ఆ పార్టీ నేతలు అన్నీ అబద్ధాలే చెబుతున్నరు. ఆచరణ సాధ్యంకాని హామీలు ఇస్తున్నరు. కల్యాణ లక్ష్మి సాయం, తులం బంగారం పెడుతామంటున్నరు. ఇంకేవేవో గ్యారెంటీలంటూ నమ్మిస్తున్నరు. నేనొక్కటే అడుగుతున్నా. రాష్ట్రాన్ని 60 ఏండ్లు పాలించినోళ్లు, ఇవన్నీ అప్పుడు ఎందుకు చేయలేదు. ఇప్పుడు దేశంలోని పాలిత రాష్ట్రాల్లో ఇస్తున్నరా..? అమ్మకు అన్నం పెట్టనోడు, పిన్నమ్మకు బంగారు గాజులు కొనిపెడుతా అన్నట్లు ఉంది వాళ్ల వ్యవహార శైలి'. బీజేపీది అదే పరిస్థితి. నమ్మిన ప్రజలను నిండా ముంచుడు తప్ప చేసిదేం ఉండదు. నమ్మితే మోసపోతరు.. జాగ్రత్త అంటూ' అని కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం కోరుట్ల పట్టణంలోని పలు వార్డుల్లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్‌కు ఆయా కాలనీల్లో యువకులు, మహిళలు బ్రహ్మరథం పట్టారు. వేలాది మంది తరలివచ్చిన 'సంజయ్ జిందాబాద్, కారు గుర్తుకే మన ఓటు' అంటూ నినదించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడారు. 'ఈ రోజు ఇక్కడ పోటీలో ఉన్న ఆ రెండు పార్టీల అభ్యర్థులు స్థానికేతరులు. ఒకరు నిజామాబాద్‌లో ఉంటే, మరొకరు హైదరాబాద్‌లో ఉంటరు. ఎన్నికల వేళ మాత్రమే వారికి ప్రజలు గుర్తుకు వస్తరు. ఇక్కడే పుట్టి, మీ చేతుల్లో పెరిగి, మీకు సేవ చేసేందుకు వచ్చిన స్థానికుడినైన నేను కావాలా..? గెలిచిన తర్వాత పత్తకు లేకుం టా పోయే స్థానికేతరులు కావాలా..? ' ఆలోచించుకోవాలని ప్రజలకు సూచించారు. మంచి పనులు చేసిన సీఎం కేసీఆర్‌ను మళ్లీ గెలిపించుకుందామని, అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కోరుట్ల నియోజవర్గంలో భిన్న సంస్కృతులు, మతాల మేళవింపుతో ప్రశాంత వాతావరణంలో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారని, పచ్చని మన జీవితాల్లో కల్లోలాలు సృష్టించేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ హయంలో తెలంగాణలో నిరంతర విద్యుత్, తాగు, సాగు నీరు కు ఢోకా లేకుండా పాడిపంటలతో సస్యశ్యామలంగా మారిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి మహిళకు రూ. 3 వేల పింఛన్ అందిస్తామని, కేసీఆర్ బీమా కింద పేద కుటుంబంలో ఎవరు మరణించినా రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించనున్నారని తెలిపారు. కోరుట్లలో గూడు లేని నిరుపేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తనది అంటూ అభయమిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కన్నీళ్లే దిక్కువుతాయని, మళ్లీ పరాయి పాలన వస్తుందని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడారు. తనను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోలేదన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని చేశానని, కరోనా కష్టకాలంలో మీ వెన్నంటి ఉన్న తన కొడుకు సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పట్టణంలోని 11వ వార్డులో, బిలాల్‌పురాలో వంద మంది యువకులు బీఆర్ఎస్ చేరగా, పార్టీ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు అన్నం లావణ్య, ఉపాధ్యక్షుడు గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, నాయకులు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి.. ఆదర్శంగా తీర్చిదిద్దుత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
- జిల్లా కేంద్రంలో తీన్‌ఖనీ వద్ద కార్నర్ మీటింగ్

జగిత్యాల అర్బన్, నవంబర్ 13: ' నన్ను గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టా. ఇప్పటికే జగిత్యాలను రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేసిన. ప్రజల ఆశీర్వాదంతో పేద ప్రజలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపిన. ఒక వైద్యుడిగా వేలాది మందికి ఉచిత ఆపరేషన్లు చేసి కంటి చూపును ప్రసాదించానని' జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల మున్సిపల్ పరిధిలోని 28,29,41,42 వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేశారు. తీన్‌ఖనీ వద్ద కార్నర్ మీటింగ్‌ను నిర్వహించి, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. న్యూ హైస్కూల్ వద్ద గతంలో పైపులైన్లు పగిలిపోయి తాగు నీరు లీకయ్యేదని, మంచి క్వాలిటీతో కొత్త పైపులైన్లు వేసి సమస్య తీర్చినట్లు గుర్తు చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల చింతకుంట చెరువు మురుగు కూపంగా మారిందని, వినాయక నవరాత్రులు, బతుకమ్మ పండుగ సమయంలో అక్కడక్కడ మొరం పోసి మమ అనిపించేవారన్నారు. కానీ తాము చింతకుంట చెరువు రూపురేఖలు మార్చి మినీ ట్యాంకు బండుగా మార్చి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తెచ్చామని, పిల్లలు ఆడుకునేందుకు సైతం ఆటపరికరాలను అమరుస్తున్నట్లు చెప్పారు. శిథిలమైన ఉర్దూఘర్‌కు రూ.55లక్షలు మంజూరు చేసి కొత్త భవనం కట్టామని, పురాణిపేట లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి నిధులు వెచ్చించామని వివరించారు. జగిత్యాల పట్టణంలో అత్యంత నాణ్యతతో రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండే జాతీయ రహదారులను సైతం మనమే అభివృద్ధి చేస్తున్నామన్నారు. జగిత్యాల నుంచి నిజామాబాద్ వైపు, తిప్పన్నపేట వైపు, కరీంనగర్ వైపు రహదారులను అభివృద్ధి చేయాలని నేషనల్ హైవే అథారిటీ డీజీని కలిసి వినతిపత్రాన్ని అందచేయగా, మంచినీల్ల బావి నుంచి చల్‌గల్ దాకా నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి రూ.18.50కోట్లు మంజూరు తెచ్చినట్లు చెప్పారు. కాగా, జగిత్యాల పట్టణానికి చెందిన 25 మంది మైనార్టీ యువకులు బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు తాజొద్దీన్, షాకీర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా, వారికి ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇక్కడ కౌన్సిలర్లు పంబాల రాంకుమార్, అవారి శివకేసరిబాబు, కప్పల శ్రీకాంత్, ఆసీఫ్, తాజుద్దీన్, మైనార్టీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.